సాక్షి విశాఖపట్నం

గురువారం । 30 । జనవరి । 2025



లాహిరి లాహిరి లాహిరిలో..



కనులపండువగా అప్పన్న తెప్పోత్సవం

8లో

పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకా విహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి కిటకిటలాడింది.



కోడ్ కూసింది

- ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్
- ఫిబ్రవరి 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల నియామవళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 3న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి, 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల **పరిశీలన చేస్తారు.** 13వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుంది, 27న పోలింగ్ పూర్తి చేసి, మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. అభ్యర్థి ఎన్నికను అధికారికంగా ప్రకటించే వరకు ఎన్నికల నియామవళి అమలులో ఉంటుందని కలెక్టర్, ఎన్నికల ప్రధాన అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించి ఫిబ్రవరి 3న ఆయన అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఆరు జిల్లాల రెవెన్యూ అధికారులు(డీఆర్వో)లు వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం ఈ ఏడాది మార్చి **29తో పూర్తవుతుంది.**

21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను గత నెల 30న ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 12,948 మంది, మహిళలు 8,607 మంది. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం జిల్లాలో 4,937 మంది, మన్యం పార్వతీపురం జిల్లాలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది, విశాఖ జిల్లాలో 5,277 మంది, అనకాపల్లిలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్నికల కమిషన్‌కు పంపారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



డాబాగార్డెన్స్: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు విశాఖపట్నం నుంచి ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ(2+2 పుష్‌బ్యాక్) బస్సులు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ప్రయాగరాజ్‌తో పాటు అయోధ్య, వారణాసి పుణ్యక్షేత్రాలు దర్శించుకునేలా రానుపోను 7 రోజుల యాత్రను రూపొందించినట్టు చెప్పారు. యాత్రలో భాగంగా ప్రయాగరాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుందని, వసతి, భోజన సదుపాయాలు ప్రయాణికులే చూసుకోవాలన్నారు. 34 మంది కలిసి వస్తే వారికి అనుకూలమైన రోజు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. 34 మందికి, 7 రోజుల యాత్రకు రూ.2,74,000 చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9052227083, 9959225594 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ఒక టికెట్‌కు అయితే రూ.8 వేలు చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు www.apsrtconline.in వెబ్‌సైట్‌లో గానీ సమీప బస్ స్టేషన్, ఆర్టీసీ టికెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద టికెట్ పొందవచ్చన్నారు. మహా కుంభమేళాకు విశాఖ డిపో నుంచి ఫిబ్రవరి 4, 8, 12 తేదీల్లో బస్సులు బయలుదేరుతాయన్నారు.

నేటి నుంచి ఆర్థోపెడిక్ సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు(ఒసాప్కిన్)– 2025ను ఈ నెల 30 నుంచి వచ్చే నెల 2 వరకు నగరంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. బుధవారం కేజీహెచ్‌సీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నార్త్ ఆంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల, కేజీహెచ్ ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో దేశ, విదేశాల నుంచి దాదాపు వెయ్యి మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ఎక్స్‌లెన్స్ ఎక్రాస్ ఆల్ డైమెన్షన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ నినాదంతో జరిగే ఈ వర్క్‌షాపులో 1వ తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారన్నారు. 400 మంది వైద్యుల పేపర్ ప్రజెంటేషన్‌తోపాటు, పోలిట్రామ్, ఓపెన్ మేనేజ్‌మెంట్ థీమ్‌పై గంగా ఆస్పత్రి డైరెక్టర్ రాజశేఖర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల బృందం లైవ్ ప్రజెంటేషన్ ఇస్తారని పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లోకనాథ్ మాట్లాడుతూ ఆర్థోపెడిక్ విభాగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై పీజీ వైద్యులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. డాక్టర్లు వర్మ, లీలాప్రసాద్, భవానీప్రసాద్, ఎంసీహెచ్ నాయుడు, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

మార్చి 8న మెగా లోక్ అదాలత్

విశాఖ లీగల్ : మార్చి 8వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో 'పని ప్రదేశంలో లైంగిక దాడులు చట్టాలు' అన్న అంశంపై న్యాయమూర్తులు, పోలీసులు అధికారులు, ఇతర సంస్థలు ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పని ప్రదేశాల్లో మహిళలపై అసభ్య, అనైతిక ప్రవర్తన, లైంగిక దాడులు తరచూ జరుగుతున్నట్లు పలువురు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంస్థల్లో పనిచేసే మహిళలకు లైంగిక దాడుల చట్టానికి సంబంధించి పలు అంశాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశానికి సంబంధించి సంస్థలు ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని కోరా రు. ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధా రత్నం, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, ఇతర జిల్లా న్యాయమూర్తులు, అనకాపల్లి, అల్లూరి, విశాఖ జిల్లాలోని వివిధ న్యాయస్థానాల న్యాయమూర్తులు, ప్రభుత్వ సంస్థల అధికారులు, బీమా కంపెనీ ప్రతినిధులు, బ్యాంకులు, పోలీసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నలుగురు జైలు సిబ్బందికి చార్జి మెమోలు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నలుగురు సిబ్బందికి రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు బుధవారం చార్జి మెమోలు జారీ చేశారు. ఓ కేసులో ఉప్పాడ గౌరీ శంకర్ అనే ఖైదీ గత ఏడాది జూలై 25వ తేదీన జైలుకు వచ్చాడు. అతడిని క్వారెంటైన్‌లో ఉంచకుండా.. జైలు వైద్యాధికారి, అధికారుల అనుమతి లేకుండా మరుసటి రోజు గోదావరి బేరక్‌కు సిబ్బంది తరలించారు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న గౌరీ శంకర్ అదే నెల 30న ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు విచారణలో వెల్లడి కావడంతో సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నట్లు జైళ్ల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. జైలర్ కుషా కుమార్, డిప్యూటీ జైలర్ వై.సింహాచలం నాయుడు, హెడ్ వార్డర్ డి.వెంకటరమణ, వార్డర్ వి.వాసుదేవరావుకు చార్జి మెమోలు పంపించారు.

ఎవరి దారి వారిదే!

ఓ వైపు టూరిజం రంగాన్ని అగ్రపథంలో తీసుకెళ్తామంటూ బాకాలు ఊదుతున్న కూటమి ప్రభుత్వం.. ఉత్తరాంధ్ర పర్యాటకాన్ని.. ముఖ్యంగా విశాఖలో వ్యవస్థను మాత్రం గాలికొదిలేసింది. పేరుకే ముగ్గురు పర్యాటకాధికారులున్నా.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా టూరిజం అధికారి అంతా తానై వ్యవహరిస్తుండగా.. మూడు జిల్లాల ప్రాంతీయ అధికారి, డివిజనల్ మేనేజర్ అసలు ఉన్నారా లేదా అనే సందేహం అందర్లోనూ నెలకొంటోంది. టూరిజం ఉన్నతాధికారులు సైతం అధికారులను పట్టించుకోకపోవడంతో జిల్లాలో పర్యాటక వ్యవస్థ గాడితప్పింది.

- జిల్లా టూరిజంలో భిన్నధృవాలుగా అధికారులు
- అన్నీ తానై వ్యవహరిస్తున్న డీటీవో
- ఉత్తరాంధ్ర ఆర్‌డీకి ప్రాధాన్యం శూన్యం
- ఉన్నారో లేరో తెలియని ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్
- ప్రధాన కార్యక్రమాల్లోనూ కొరవడిన సమన్వయం
- పర్యాటక శాఖను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో ప్రధాన టూరిస్ట్ కేంద్రంగా విశాఖ విలసిల్లుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన రూ.కోట్ల విలువైన టూరిజం ప్రాజెక్టులు ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్నాయి. అయితే జిల్లాలో పర్యాటక శాఖ అధికారుల తీరు అందర్నీ విస్మయానికి గురి చేస్తోంది. జిల్లా టూరిజం అధికారిగా జ్ఞానవేణి బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. డివిజనల్ మేనేజర్‌గా జగదీష్ వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర రీజనల్ డైరెక్టర్‌గా రమణ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ముగ్గురి వ్యవహారం మాత్రం ఎవరికి వారే అన్నట్లుగా ఉంది. ముగ్గురి మధ్య సమన్వయం లేదనే మాటలు వినిపిస్తున్న నేపథ్యంలో మూడు రోజుల క్రితం జరిగిన రీజనల్ టూరిజం సమ్మిట్‌లో ఈ వాదన స్పష్టమైంది. వాస్తవానికి ప్రాంతీయ సదస్సులో రీజనల్ డైరెక్టర్ అన్నీ తానై వ్యవహరించాలి. కానీ.. సదరు ఆర్‌డీ మాత్రం సదస్సులో ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి కనిపించింది. డీటీవో జ్ఞానవేణి మొత్తం బాధ్యత తనదే అన్నట్లుగా సదస్సులో కనిపించారు. ఇక ఏపీటీడీసీ డీవీఎం కూడా సదస్సుతో తనకు సంబంధం లేదన్నట్లుగా అంటీ ముట్టనట్లుగా కనిపించారు.

బాధ్యతలు పంచుకోలేదు

సదస్సుకు రెండు రోజుల ముందునుంచీ ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలితో పాటుగా ఉన్నతాధికారులు విశాఖలో తిష్ట వేశారు. సదస్సు నిర్వహణకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. అంతా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కానీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ సమన్వయం ఎక్కడా కనిపించలేదు. ఆమ్రపాలి ముందు.. అంతా ఓకే అని చెప్పి.. తర్వాత.. తమ పని తమదే అన్నట్లుగా ముగ్గురూ తలోదారి పట్టారు. సమ్మిట్‌కు సంబంధించిన బాధ్యతలను పంచుకునేందుకు ముగ్గురు అధికారులు ఒక్కసారి కూడా సమావేశమవ్వనట్లు సమాచారం. దీంతో సదస్సులో స్థానిక టూరిజం అధికారులు అంతగా కల్పించుకోలేదు.



ఇన్‌చార్జితోనే కాలయాపన

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామంటూ ముఖ్యమంత్రి, మంత్రితో సహా.. కూటమి నేతలు ఊదరగొడుతున్నారు. కానీ.. ఆ శాఖలో అధికారులను నియమించే విషయంలో మాత్రం చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదు. ఉత్తరాంధ్రలో కీలకమైన టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ పోస్టులో ఇంజినీరింగ్ అధికారి రమణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారిపై అనేక ఆరోపణలున్నాయి. అయినా... సదరు ఇంజినీరింగ్ అధికారికే బాధ్యతలు కట్టబెట్టారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అల్లూరి వరకూ ప్రతి టూరిజం ప్రాజెక్టు బాధ్యతను పక్కాగా పర్యవేక్షించాలి. కొత్త ప్రాజెక్టుల కోసం చర్చలు జరపాలి. ఇలాంటి బాధ్యతలు కలిగిన పోస్టు విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆ శాఖ ఉద్యోగులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- ఉన్నతాధికారులకు చిక్కిన పరవాడ ఎంపీడీవో?
- రక్త నమూనా సేకరించి, విచారణ చేపట్టిన అధికారులు



శ్యామ్‌సుందర్(ఫైల్)

మద్యం సేవించి.. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు

పరవాడ: పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ మద్యం మత్తులో ఉన్నతాధికారులకు పట్టుబడినట్లు తెలిసింది. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో మద్యం సేవించి పాల్గొన్నట్లు సమాచారం. వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న సమయంలో ఎంపీడీవో మాటలు తడబడటంతో మద్యం సేవించి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆయన తీరుపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు హుటాహుటిన ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని విచారణ జరిపారు. ఆయన ఎంపీడీవో మద్యం సేవించి విధులకు హాజరైనట్లు నిర్ధారిస్తూ, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. శ్యామ్‌సుందర్ చోడవరం ఎంపీడీవోగా పనిచేసి గతేడాది సెప్టెంబర్ 24న బదిలీపై పరవాడ వచ్చారు. బాధ్యతలు తీసుకున్న దగ్గర నుంచి ఆయన వ్యవహార శైలిలో ఏ మాత్రం మార్పు రాలేదు. రోజూ మద్యం సేవించి విధులకు రావడం, సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి చేష్టలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఎంపీడీవో విధులకు వచ్చే క్రమంలో మద్యం సేవించకుండా నియంత్రించేందుకు ఆయన భార్య, తల్లి వెంట రావడం పరిపాటిగా మారింది. బుధవారం ఆయన వెంట వీరిలో ఎవరూ లేకపోవడంతో మద్యం సేవించి కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఉన్నతాధికారులకు అడ్డంగా దొరికిపోయినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారితోపాటు సీఐ ఆర్.మల్లికార్జునరావు, ప్రభుత్వ వైద్య సిబ్బంది కార్యాలయానికి వచ్చి ఆయన రక్త నమూనాలను సేకరించినట్లు సమాచారం. ఈ ఘటనపై మండల ప్రత్యేక అధికారి వివరణ కోసం ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటులో లేరు. పరవాడ సీఐ మల్లికార్జునరావును వివరణ కోరగా విషయం వెల్లడించడానికి నిరాకరించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల

అధ్యక్షుల నియామకం



దొడ్డి కిరణ్



పేడాడ రమణికుమారి



బోని శివరామకృష్ణ



బర్కత్ అలీ

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లాలో 16 విభాగాలకు అధ్యక్షులను నియమించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా దొడ్డి కిరణ్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా పేడాడ రమణికుమారి, బీసీ సెల్ అధ్యక్షుడిగా సనపల రవీంద్ర భరత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బోని శివరామకృష్ణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా బర్కత్ అలీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఆదేపల్లి రవీంద్రబాబు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పులగం కొండారెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా సేనాపతి అప్పారావు, వలంటీర్ వింగ్ అధ్యక్షుడిగా పీలా ప్రేమ్ కిరణ్ జగదీష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎస్.ప్రసాదరావు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా రాయపు అనిల్‌కుమార్, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎం.బాజీరావు, చేనేత వింగ్ అధ్యక్షుడిగా చిక్కాల సత్యనారాయణ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా బొండా ఉమా మహేశ్వరరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వాసుపల్లి యల్లాజీ, బూత్ కమిటీ అధ్యక్షుడిగా గున్నంటి పూర్ణానంద శర్మను నియమించారు.

పరస్పర సహకారంతో యువతకు ఉపాధి

పరిశ్రమలు, విద్యా సంస్థల అధికారులకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: విద్యా సంస్థలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకుల పరస్పర సహకారం, ప్రణాళికతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. చదువుకు తగ్గ ఉద్యోగం నిర్ణీత సమయంలో వచ్చేలా ప్రణాళికలు రచించాలని, ఉద్యోగ అవకాశాలకు తగ్గట్టు కోర్సులు అందించాలని ఆయా సంస్థలను కోరారు. ఇంటరాక్షన్ ఆన్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ క్రియేషన్ ఇన్ విశాఖపట్నం రీజియన్ అనే అంశంపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అందుకు తగిన కార్యాచరణతో ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. విద్యా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు నెలకు ఒక్కసారి ప్రత్యేకంగా సమావేశం కావాలని, అవసరాలను గుర్తించి అందుకు తగిన అభ్యర్థులను తయారు చేసుకోవాలన్నారు. విద్యా సంస్థలు, పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు, భవిష్యత్ అవకాశాల గురించి యువతకు తెలియజేసేందుకు వీలుగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ సంబంధిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, తగిన నైపుణ్యం కలిగిన వ్యక్తులను అందించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని అంశాల్లో నైపుణ్యం కలిగిన యువత స్థానికంగా లభ్యం కావడం లేదని, కంపెనీల అవసరాలకు సరిపడిన ఇంజినీర్లను తయారు చేసే కోర్సులు స్థానికంగా లేవన్నారు. దీనిపై ఆంధ్రా యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఐఐఎం విద్యా సంస్థల ప్రతినిధులు స్పందించారు. తగిన నైపుణ్యం కలిగిన యువత తమ వద్ద ఉన్నారని, అయితే వారికి ఉపాధి అవకాశాల గురించి తగిన సమాచారం లేదన్నారు. ఆయా కంపెనీల్లో ఉండే ఉద్యోగాలకు ఎలాంటి యువత కావాలో తెలిపితే.. అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐఐ ప్రతినిధులు మురళీ కృష్ణ, నీరజ్ సర్దా, గ్రంధి రాజేశ్, పీఎస్ ఠాగూర్, ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, వివిధ విభాగాలు, విద్యాసంస్థలు, పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో కలకలం



ప్రమాదంలో శిశువును కాపాడుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



అత్యవసర సమయంలో తప్పించుకునేలా..

విపత్తులపై అప్రమత్తత

ఉత్కంఠగా సాగిన మాక్‌డ్రిల్

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ఎన్‌డీఎంఏ, ఫైర్, ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో చిక్కుకున్న క్షతగాత్రులను పై అంతస్తుల నుంచి దించడం, అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించడం, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో చికిత్స అందించడం తదితర దృశ్యాలు ప్రయాణికులను ఆందోళనకు గురి చేశాయి. దీనికి తోడు కొందరు సెల్‌ఫోన్లకు విపత్తుల నివారణ సంస్థ పేరుతో అలర్ట్ రావడంతో మరింత ఆందోళన నెలకొంది. అసలు విషయం తెలుసుకుని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో తుపాను, వరదలు వంటి విపత్తులు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై విశాఖ విమానాశ్రయంలో బుధవారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. కొత్త టెర్మినల్ వద్ద ఎన్‌డీఎంఏ, ఎస్డీఆర్ఎఫ్, మెడికల్, పోలీస్, ఫైర్ సర్వీస్ అధికారులు ఇతర శాఖల సహకారంతో ఈ కార్యక్రమం ఉత్కంఠభరితంగా సాగింది. ఇది చూసిన వారంతా చాలాసేపటి వరకు ఏమి జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. విపత్తు సంభవించిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం, క్షతగాత్రులను సురక్షితంగా తరలించడం వంటి చర్యలను సహాయక సిబ్బంది తమదైన శైలిలో ప్రదర్శించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు అసిస్టెంట్ డైరెక్టర్ పురుషోత్తం మాట్లాడారు. 'తుపానులు, విమానాశ్రయంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించాం. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఎలా స్పందించాలి? ఏయే విభాగాల వారికి సమాచారం అందించాలి? ప్రమాద బారిన పడకుండా ప్రయాణికులను ఏ విధంగా కాపాడాలి? సురక్షిత ప్రాంతాలకు చేర్చడం వంటి పలు అంశాలపై ఈ ఎక్సర్‌సైజ్ సాగింది. ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో మెళకువలు, నూతన విధానాలు, టెక్నాలజీని ఉపయోగించడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోగలిగాం' అని ఆయన వివరించారు. వివిధ శాఖల అధికారులు, ఏవియేషన్ కమాండ్ అధికారులు పాల్గొన్నారు.



తాడు సాయంతో బాధితురాలిని కాపాడుతూ..



క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తూ...



ప్రమాదంలో రేగిన మంటలను అదుపు చేస్తూ...

హోరాహోరీగా పోరు.. క్రీడాకారుల జోరు



బంతిని ప్రత్యర్థి కోర్ట్‌లోకి స్మాష్ చేస్తున్న ఫార్వార్డ్ జోన్ క్రీడాకారిణి

ఉత్సాహంగా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

విశాఖ స్పోర్ట్స్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. మూడు రోజులపాటు జరిగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్ అంశాలతోపాటు ఆరు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల ఆటగాళ్లు ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీపడుతున్నారు. రెండో రోజు బాలురు, బాలికలకు జరిగిన వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ పోటీలు తుది దశకు చేరుకోగా ఇండోర్ క్రీడలు ముగిశాయి. అథ్లెటిక్స్ ట్రాక్‌లో బాలుర 1,500 మీటర్ల పోటీ ముగియగా, ఫీల్డ్‌లో జావెలిన్, డిస్కస్‌తోపాటు హైజంప్ పోటీలు ముగిశాయి. కాగా.. ఈ ఏడాది నుంచి జరిగే మీట్స్‌లో ఉద్యోగులకు కూడా పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ గణేష్‌కుమార్ నిర్ణయించారని మీట్ కన్వీనర్ నారాయణరావు, కో-కన్వీనర్ జానకిరామయ్య తెలిపారు. ఈసారి మహిళా విభాగంలో ఉద్యోగులకు టీటీ పోటీలు నిర్వహించామని వెల్లడించారు.

వివిధ పోటీల్లో విజేతలు వీరే..

మహిళల విభాగం టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో భార్గవి శివప్రభ (శ్రీకాకుళం), యు.దేవకుమారి (కర్నూలు) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఎం.కీర్తి-హెచ్.ఉషా(శ్రీకాకుళం) జోడీ విజేతగా నిలవగా, టి.అంజనాదేవి-ఎస్.సులక్షణ(గుంటూరు) జోడీ రన్నరప్ సాధించింది.

● బాలికల చదరంగం పోటీల్లో కె.జాహ్నవి శ్రీ (భీమునిపట్నం), బి.రమ్యశ్రీ వైష్ణవి (శ్రీకాకుళం), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో వై.గాయత్రిదేవి (గుడ్లవల్లేరు), జి.రమ్య (తిరుపతి), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో కె.ప్రతీ సత్యశివాని (గన్నవరం), ఆర్.సాయి అశ్మిత (నెల్లూరు) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో వి.దీప్య-బి.సుభాషిణి (భీమునిపట్నం) జోడీ, ఎస్.ఓష్మశ్రీ - ఎస్.హర్షిణి (ఏలూరు) జోడీ, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో ఎస్.ఓష్మశ్రీ- బి.దివ్య (ఏలూరు) జోడీ, వై.గాయత్రిదేవి-టి.ప్రశాంతి జోడీ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. షాట్‌పుట్‌లో వి.లక్ష్మిసాయి కృష్ణతులసి (తూర్పుగోదావరి), కె.భారతి (గుడ్లవల్లేరు, కృష్ణా), ఎ.రక్షిత (భీమునిపట్నం, విశాఖ), డిస్కస్‌త్రోలో కె.వెంకట మానస (రంగంపేట), వి.లక్ష్మీ సాయి కృష్ణ తులసి (పెద్దాపురం, తూర్పుగోదావరి), టీహెచ్ఎస్ఎస్ లక్ష్మి (ఏలూరు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.



లెగ్‌త్రస్ట్ చేస్తున్న కబడ్డీ డిఫెండర్

● బాలుర చదరంగంలో డి.షణ్ముఖ సత్య ఉదయ్ సాత్విక్ (అమలాపురం), కె.నిఖిలేష్ సాయి (గుడ్లవల్లేరు), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎం.యువ సంతోష్ మణి పట్టాభి రామ్ (కాకినాడ), జి.రెడ్డిచరణ్ (తిరుపతి) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఎ.హేమంత్‌కుమార్ - కె.శుభార్జున్ (పరిటాల) జోడీ, బి.అభిషాయ్- జె.అత్యుత సాయ్ కుమార్ (ఆనందపురం) జోడీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఎం.సూర్యకిరణ్ -కె.రిషి జోడీ, ఎన్.జస్వంత్-జి.విజయ్ లిఖిత్ జోడీ (పొద్దుటూరు) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. హైజంప్‌లో ఎస్.ఈశ్వర్ వర్దన్ (ఆనందపురం), కె.ప్రశాంత్‌కుమార్ (పాడేరు), వి.త్రిమూర్తి (కర్నూలు) తొలి మూడు స్థానాల్లో నిలవగా, జావెలిన్‌త్రోలో ఎస్.చరణ్ (ఎటపాక), కె.ప్రణీత్ (విశాఖ), కె.సూర్యతేజ (ఏలూరు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 1,500 మీటర్ల పరుగులో వై.మహేష్ (అనంతపురం), టి.నాగశ్రీనివాసులు (కర్నూలు), కె.శేషాద్రి (కర్నూలు) తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.



డబుల్ బ్లాక్ చేసిన ఆటగాళ్లు

గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

విశాఖ లీగల్: గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జిగా నియమితులయ్యారు.

ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: ఆర్థిక అవసరాలు కలిగిన యువతులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని, సులువుగా డబ్బులు సంపాదించే ఆశ చూపి పెద్ద ఎత్తున ఆన్‌లైన్ వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఓ ప్రకటన విడుదల చేశారు. నిందితులు మద్దిలపాలెం, చైతన్యనగర్‌కు చెందిన గొర్లె నరేష్, వన్‌టౌన్, లక్ష్మీటాకీస్ ప్రాంతానికి చెందిన గంగిరి పవన్ కల్యాణ్ అలియాస్ బాబీ, శ్రీకన్య థియేటర్ దరి, సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన నీలగిరి వెంకటలక్ష్మి, ఆరి లోవ, దుర్గా బజార్‌కు చెందిన గంగిరి పద్మ, విజయనగరం జిల్లా, లక్కవరపు కోటకు చెందిన పెదగాడి శ్రీనులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇదే కేసులో గతంలో 11 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

మరోసారి తెరపైకి రింగు వలల వివాదం

ఎంవీపీకాలనీ: రింగు వలల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రింగు వలల వేటను తొలి నుంచి 19వ వార్డు వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు స్వాగతిస్తుండగా, పెదజాలరిపేట మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గతంలో తీవ్ర స్థాయిలో ఘర్షణలు తలెత్తాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, బోట్లు తగలబెట్టుకోవడంతో భారీ స్థాయి ఆస్తి నష్టం కూడా జరిగింది. ఇరువర్గాల మధ్య సమస్యను పరిష్కరించేందుకు మత్స్యకార శాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో గతంలో పలు సమావేశాలు సైతం నిర్వహించారు. అయినా రెండు వర్గాల మధ్య ఆమోదం లభించకపోవడంతో వివాదం కొలిక్కి రాలేదు. అయితే ఇటీవల వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు సిద్ధం కావడంతో జాలరిపేట వాసులు అడ్డుకున్నట్లు సమాచారం. దీంతోపాటు జాలరిపేట మత్స్యకారులు జాలరి ఎండాడ వాసులపై దాడి చేసేందుకు సైతం ప్రయత్నించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు అడ్డుకుని ఈ వారంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపినట్లు సమాచారం. అయితే బుధవారం కొందరు వేటకు వెళ్లారనే సమాచారంతో జాలరిపేట వాసులు లంగర్ వేసి ఉన్న వారి బోట్లు తగలబెట్టేందుకు రాత్రి సముద్రంపైకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో బోట్లు కాపాడుకునేందుకు జాలరి ఎండాడ వాసులు సైతం సముద్రంలోకి వెళ్లినట్లు ఆ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి రెండు గ్రామాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఎంవీపీతోపాటు ద్వారకా జోన్ పోలీసులు బుధవారం రాత్రి ఇరు గ్రామాల్లో భారీగా మోహరించారు. పోలీసు ఉన్నతాధికారులు ఆయా మత్స్యకార గ్రామాల పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.

మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్పీల ధర్నా



ధర్నా చేస్తున్న ఆర్పీలు

సీతమ్మధార: ఆర్పీల ఉద్యోగ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేసి, బకాయి జీతాలను వెంటనే విడుదల చేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు హాజరై, మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలను డ్వాక్రా గ్రూపుల్లోకి తీసుకువచ్చి అనేక సేవలు అందించిన ఆర్పీలకు ప్రభుత్వాలు ఇస్తున్న వేతనాలు చాలా తక్కువని వాపోయారు. అదికూడా సకాలంలో ఇవ్వట్లేదన్నారు. తీవ్రమైన పని ఒత్తిడి, వెట్టి చాకిరీ విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగిసిన ప్రతిసారీ ఆర్పీల మీద రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని, ఆర్పీలు పార్టీ మనుషులు కాదని, ప్రభుత్వ ఉద్యోగులని పేర్కొన్నారు. ఆర్పీల పని విధానం బాగుందని అధికారులు పలు సందర్భాల్లో గుర్తించిన విషయాన్ని ప్రస్తావిస్తూ అనుభవం గల ఆర్పీలను మూడేళ్ల కాలపరిమితి ద్వారా తొలగించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు.

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా ఆర్పీలు తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు, సీఎం, పీఎం మీటింగ్‌లలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున జయప్రదం చేస్తున్న ఆర్పీల పట్ల కనీస బాధ్యత కూడా లేదని ఆక్షేపించారు. తెలుగుదేశం ప్రభుత్వం మంచి ప్రభుత్వం అయితే తక్షణం ఈ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జీవీఎంసీ ఏడీసీకి, యూసీడీ పీడీకి వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.మణి, మల్లీశ్వరి లత, ఝాన్సీ, సత్య వరలక్ష్మి, దేవి, లక్ష్మి, రత్నాలు, సన్యాసమ్మ, విశాలాక్షి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

లాహిరి లాహిరి లాహిరిలో..



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

- తెప్పోత్సవంలో హంస వాహనంపై అప్పన్న
- వేణుగోపాలస్వామిగా భక్తులకు దర్శనం

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి కిటకిటలాడింది. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శోభాయమానంగా అలంకరించిన హంసాకృతి నౌకపై స్వామిని కొలువుంచి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండపంలో స్వామిని అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు జరిపారు. ఆ తర్వాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధిని విశేషంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

తొలిసారిగా ఏపీఎస్ఆర్‌డీఎఫ్ సేవలు

తెప్పోత్సవానికి అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వరాహ పుష్కరిణి, హంస వాహనాన్ని సుందరంగా అలంకరించారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఏపీఎస్ఆర్‌డీఎఫ్ బృందం భద్రతా చర్యలకు వచ్చింది. రెండు బోట్లు, 15 మంది సిబ్బంది తెప్పోత్సవానికి తరలి వచ్చారు.

లోకో పైలట్స్ మౌనదీక్ష



డీఆర్ఎం కార్యాలయం వద్ద మౌనదీక్షలో పాల్గొన్న లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలోని లోకో పైలట్స్, అసిస్టెంట్ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్లు బుధవారం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) కార్యాలయం వద్ద ప్లకార్డులతో మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి ప్రతినిధి ఆర్‌వీఎస్ఎస్ రావు మాట్లాడుతూ మైలేజ్ కారణంగా ఉద్యోగులకు వచ్చే అలవెన్సులను నష్టపోతున్నామని, సమయపాలన అనుగుణంగా గతంలో ఇచ్చినట్లే అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమమ్ గ్యారంటీ కిలోమీటర్స్‌గా డ్యూటీ ప్రారంభించిన సమయం నుంచి 120 కి.మీ వరకు అలవెన్సు ఇవ్వాలని, ఇది సాధించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.చిన్నోడు, కేవీ చలపతిరావు, ఎస్ఎస్ రావు, సీహెచ్‌కే స్వామి, పీబీ నాయుడు, ఇతర లోకోపైలట్స్, అసిస్టెంట్ లోకోపైలట్స్, ట్రైన్ మేనేజర్స్ పాల్గొన్నారు.

'పంచ గ్రామాల భూ సమస్యకు పరిష్కారం'

సింహాచలం: పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి తొలి అడుగు పడిందని, తొలుత 12,149 ఇళ్ల నిర్మాణాల సమస్య పరిష్కారం కానుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సింహాచలంలో బుధవారం జరిగిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవంలో గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, దేవదాయ శాఖ మంత్రుల సమక్షంలో వెలగపూడిలో సమీక్ష జరిగిందన్నారు. తొలుత పంచ గ్రామాల్లోని 12,149 నిర్మాణాల సమస్య పరిష్కారంలో భాగంగా సింహాచలం దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా భూమి ఇస్తామన్నారు. సమస్య కోర్టు పరిధిలో ఉందని, ఈ విషయంపై కోర్టులో ప్రభుత్వం తరఫున అఫిడవిట్ వేస్తామన్నారు. పంచ గ్రామాల్లో ఉన్న ఖాళీలు, రైతుల ఆధీనంలో ఉన్న భూములు, అడవివరం గ్రామ కళం సమస్యలపై సమావేశంలో చర్చ జరిగిందన్నారు. వరాహ పుష్కరిణి, పూలతోటని అభివృద్ధి చేసేందుకు త్వరలోనే దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు ఆయా తేదీల వరకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

● విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు ఫిబ్రవరి 1నుంచి 28వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్ ● భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1నుంచి 28వ తేదీ వరకు, కేఎస్ఆర్ బెంగళూర్- భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ కోచ్ ● భువనేశ్వర్-తిరుపతి (22879) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1 నుంచి 22వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), తిరుపతి-భువనేశ్వర్(22880) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2 నుంచి 23వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ కోచ్ ● సంబల్‌పూర్- నాందేడ్ (20809) సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2 నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్(20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 3 నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1-స్లీపర్ క్లాస్ కోచ్ ● సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 5 నుంచి 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఈరోడ్- సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 7 నుంచి 28వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1-స్లీపర్ క్లాస్ కోచ్ ● భువనేశ్వర్-జునాగడ్(20837) ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1 నుంచి 28వ తేదీ వరకు, జునాగడ్-భువనేశ్వర్(20838) ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస కోచ్ ● పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 7 నుంచి 28వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్ -పూరి(22884)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 8 నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ ● భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1 నుంచి 28వ తేదీ వరకు, జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) హిరాకండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జతచేస్తున్నారు.

కేంద్రం కార్పొరేట్లకు అనుకూలం

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

సీతంపేట: కేంద్రంలో ప్రజల కోసం కాకుండా కార్పొరేట్లకు అనుకూల ప్రభుత్వం నడుస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర, భవిష్యత్ సవాళ్లు'అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక విధానానికి తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టారు. స్వాతంత్ర పోరాటంలో ఎటువంటి పాత్ర పోషించకుండా బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం నేడు అధికారంలో ఉండటం దురదృష్టకరమన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన తొలి రాజకీయ పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత దేశ సమైక్యత, భాషా రాష్ట్రాలు, ఫెడరల్ వ్యవస్థ కోసం సీపీఐ కృషి చేసిందని తెలిపారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరిగిన తర్వాత దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొనడాన్ని ఖండించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేదని పేర్కొన్నారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చెయ్యకపోతే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సీపీఐ సీనియర్ నాయకులు మానం అంజనేయులు మాట్లాడుతూ భవిష్యత్‌లో నాయకులు లేకుండానే ప్రజలే పోరాటాలకు సిద్ధపడతారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలో వంద సంవత్సరాల చరిత్ర ఉన్న ఏకైక పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. సదస్సులో సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి అనీరాజా, కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు, సీపీఐ నాయకులు, వామపక్ష అభిమానులు పాల్గొన్నారు.

అమృతసర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు


తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ రైల్వేస్టేషన్‌లో జరగుతున్న యార్డ్ రీ మోడలింగ్ పనుల కారణంగా అమృతసర్-విశాఖపట్నం-అమృత్‌సర్ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలుకు ఆయా తేదీల్లో సంబల్‌పూర్ సిటీలో హాల్ట్ ఇస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. అమృత్‌సర్-విశాఖపట్నం(20808) ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), విశాఖపట్నం-అమృత్‌సర్(20807) ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు మళ్లించబడిన మార్గంలో నడుస్తుంది. ఈ రైలు ఆయా తేదీల్లో సంబల్‌పూర్ స్టేషన్ మీదుగా కాకుండా సంబల్‌పూర్ సిటీ స్టేషన్ మీదుగా నడుస్తుంది.

● ముంబయి-భువనేశ్వర్-ముంబయి (11019/11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 7 నుంచి కర్జత్ స్టేషన్, మార్చి 3వ తేదీ నుంచి షాహబాద్ స్టేషన్‌ల్లో హాల్ట్ కొనసాగుతుంది.

యువకుడిపై పోక్సో కేసు

సీతమ్మధార: బాలికను మోసం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాటిచెట్లపాలెం లెప్రసికాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక గురుద్వారా ప్రార్థన మందిరం పక్కన గల బేకరిలో పనిచేస్తుంది. గురుద్వారాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నిఖిల్ (23)అనే యువకుడు ప్రేమించానని నమ్మించాడు. డిసెంబర్ 17వ తేదీన బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం యువకుడిని అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: కేసుల విచారణకు ముందు మధ్యవర్తిత్వ కేంద్రానికి బదిలీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పలువురు న్యాయమూర్తులను కోరారు. విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని శిక్షణ కేంద్రంలో బుధవారం న్యాయమూర్తులు, ఇతర ముఖ్యులకు 'మధ్యవర్తిత్వం-కేసుల రాజీ' అన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ ఉభయ పక్షాలు తమ వాదన వినిపిస్తే మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా తగిన పరిష్కారం దొరికే అవకాశం ఉందన్నారు. జాతీయ మధ్యవర్తిత్వ శిక్షకులు, చెన్నైకి చెందిన రత్నతార, సత్యారావు మాట్లాడుతూ కోర్టులో దాఖలైన ప్రతి కేసు తొలుత మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా దాదాపు 50 నుంచి 60 శాతం కేసులు రాజీ అయ్యే అవకాశం ఉందన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తులు, విశాఖ, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, అల్లూరి ప్రాంతాల నుంచి న్యాయమూర్తులు హాజరయ్యారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

కుంభమేళా ఘటన బాధాకరం

ఉదాసీన్ ఆశ్రమం స్వామీజీలు

తాటిచెట్లపాలెం: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించడం ఎంతో బాధాకరమని ఉదాసీన్ ఆశ్రమం నిర్వాహకులు తెలిపారు. పీఎం పాలెంలో గల పరమ పూజ్యులు ఉదాసీన్ ఆశ్రమము స్వామీజీలు, వారి భక్త బృందం ప్రయాగ్‌రాజ్‌లో ఉండి, తెలుగువారికి అవసరమైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ఎవరు చిక్కుకున్నా బృంద సభ్యులను సంప్రదించాలని, వారికి తగిన సహాయ సహకరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో తమ బృంద సభ్యులు అమ్మిరెడ్డి-9505383939, కృష్ణ-81251 02926, పూజ్య గురుదేవులు-89777 96669 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖలీగల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. పారా లీగల్ వలంటీర్లుగా చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఇతర సంబంధిత పత్రాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతంగాని, పారితోషకం గాని ఉండదని ఆమె స్పష్టం చేశారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై హైకోర్టులో విచారణ

మహారాణిపేట: ఎర్ర మట్టి దిబ్బల అక్రమ తవ్వకాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. దీనిపై హైకోర్టులో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, సాంప్రదాయ మత్స్యకార సంఘాల నాయకుడు తెడ్డు శంకర్ 2024లో పిటిషన్ దాఖలు చేశారు. ఎర్రమట్టి దిబ్బలను అక్రమంగా తవ్వుతూ విధ్వంసం చేస్తున్న ప్రదేశం సీఆర్‌జెడ్ జోన్-1, జోన్-3, వారసత్వ సంపద(జియో హెరిటేజ్) పరిధిలోకి వస్తుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకుండా నేరెళ్లవలస గ్రామం సర్వే నెం:118/5ఎ(పాత సర్వే నెం:49/1)లో 242.47 ఎకరాల్లో ది భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-అపరేటివ్ బిల్డింగ్ సొసైటీ పనులు చేపట్టిందన్నారు. జీవీఎంసీ ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం పనులను వెంటనే నిలుపుదల చెయ్యాలని, జీవీఎంసీకి, ఇతర సంబంధిత శాఖలకు ఏపీ హైకోర్టు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్టే కొనసాగిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం సంబంధిత శాఖలను కౌంటర్లు దాఖలు చేయాల్సిందిగా పేర్కొంటూ, కేసును నాలుగు వారాలు వాయిదా వేసినట్లు కార్పొరేటర్ మూర్తి యాదవ్ తెలిపారు.